

# జేబు

పెనుమాక నాగేశ్వరరావు

అదిగో సరిగ్గా నా మంచానికి ఎదురుగ్గా గోడకున్న మేకుకు వేలాడుతున్న నా చొక్కా గురించి నాలుగు మాటలు ఎవరితోనైనా చెప్పుకోవాలన్న తపనే.

నిజం చెప్పాలంటే ఆ చొక్కా తెల్ల రంగుదే. కానీ దాన్ని చూసిన వారెవ్వరూ తెల్లచొక్కా అనుకోలేరు. అది గోధుమ వర్ణానికి మారి చాలాకాలం అయింది. వుండవలసినన్ని గుండీలు లేవు. వున్నవి కూడా వుండాల్సినట్లు లేవు. వుండామా వూడదామా అన్నట్లున్నై నాకు మల్లేనే.

మో చేతిపైన ఫిల్టులా కుట్టబడినచోట సగం కుట్లు వూడిపోయి అసహ్యంగా కన్పిస్తున్నది. కాలరంతా కాటుక పూసినట్లున్నది. చొక్కా మొత్తం మీద అరడజను పైగా చినుగులు, చిల్లులు.

గాలి వీచినప్పుడల్లా ఆ పాడవాటి చేతులు నిస్సహాయంగా వూగుతుంటై. ఆవూపు ఆటుపోట్లకు తట్టుకుంటా బ్రతికే మధ్య తరగతి జీవితాన్ని జ్ఞాపకం తెస్తుంటుంది నాకు. చొక్కాగాలికి అలా వూగినందువల్ల ఈ మేరకు గోడ మిలమిలా మెరుస్తుంటుంది. ఆమెరుపు మిగిలిన గోడను వెలవెలబోయేటట్లు చేస్తుంటుంది.

నా పేరు మాధవరావు. ప్రయివేటు ఫరమ్‌లో ఒళ్ళుదాచుకోకుండా పనిచేసి నాలుగురాళ్లు సంపాదించు కున్నాను. ఈ సంపాదనలోనే పిల్లలకు చదువు చెప్పించాను. వున్న ఒక్క కూతురికీ నా శక్తికి తగినట్లు ఓ సంబంధం చూసి పెళ్లి చేసేశాను.

ప్రస్తుతం వుద్యోగం, సద్యోగం లేని మనిషిని. పెద్ద కొడుకు ఇంట్లో పొట్టపోసుకుంటూ ప్రాణం నిలుపుకుంటున్నా ఉనికి వాళ్లకు భారమయిందని తెలిసి కూడా అలా బ్రతికేస్తున్నాను.

నా కష్టంలోనూ, సుఖంలోనూ, సంతోషంలోనూ విచారంలో కూడా భాగం పంచుకుని, ఏ విషయంలోనూ నన్ను నొప్పించకుండా, అన్యోన్యంగా, అనుకూలంగా నాతో సహజీవనం సాగించిన నా భార్య సావిత్రి ఓ దుర్ముహూర్తంలో నన్ను విడిచి పరలోకానికి వెళ్లి పోయింది.

మీరిన వయసు, అననిదృష్టి, అనారోగ్యం అన్న కలసి నన్ను అశక్తుణ్ని చేసినయ్.

క్షమించండి.మీకు చెప్పుకోవాలను కున్నది నా చొక్కా గురించి. కానీ మధ్యలోనా సొంత గోడు కొంత వెళ్లబోసుకున్నాను. పుస్తకాల్లో చోటు చేసుకునేటంత గొప్ప చరిత్రలు కావు కదా నాలాంటి వారి బ్రతుకులు.

ఆత్మీయంగా పలుకరించే మనిషి తటస్థపడినప్పుడిలా చెప్పుకుని తృప్తి పడటం అలవాటు చేసుకున్నాను.

ఆ చొక్కాకున్న జేబు మాత్రం నన్ను ప్రతిక్షణం పరిహసిస్తూనే ఉంటుంది. పగలబడి నవ్వుతున్నట్లని పిస్తుంది. ఎగతాళి చేసి వెక్కిరిస్తుంటుంది. ఆ వెక్కిరింత గతంలోని నా **అమాయకత్వానికో ఇప్పటి అసహాయతకో తెలుసు కోవాలన్నది నా కోరిక.**

అదలా వెక్కిరించి ఎగతాళి చేస్తున్నదని గమనించినప్పుడల్లా నా మీద నాకే జాలి, కోపం, అసహ్యం, అన్నీ మూకుమ్మడిగా కలుగుతై. నాలో నేనే సిగ్గుపడి పోతుంటాను. అయితే ఆ సిగ్గు ఎంతో సేపు నిలబడదు. నిలువనీయను. నిలిస్తే ఎలా బ్రతకటం. అందుకే ఎప్పటి కప్పుడు ఆ సిగ్గుని అలా వదిలేయటం అలవరచుకున్నాను.

'అపుత్రస్యగతి ర్నాస్తి' అనే మాట ఎలా వున్నా నాకు మాత్రం అన్యథా శరణం నాస్తి. అమ్మాయి అత్తవారింటకి వెళ్ళిపోయింది. అబ్బాయి లిద్దరూ కూడా అత్తవారింటికి కాక పోయినా, ఒకరకంగా పరాయింటికి వెళ్లి నట్లే లెక్క..

మరో మార్గం లేక నేను వాళ్లమీద అధారపడక తప్పలేదు. అయినా అది నా

హక్కు అనుకున్న పిచ్చివాడ్ని. కాని వాళ్ల బాధ్యతగా గుర్తించలేదు. నేను సంపాయించిన ప్రతి పైసాతోనూ వాళ్ల సంతోషమే కొనుక్కున్న పిచ్చివాడ్ని. వాళ్లకోసం పడిన కష్టం తోనూ, తాపత్రయం లోనూ వాళ్ల తృప్తిని ఆనందాన్ని వెతుకున్న వెర్రివాడ్ని.

ప్రస్థుతం ముసలాయన చొక్కా అని పిలువబడుతున్న ఆ చొక్కా ఒకప్పుడు 'నాన్నగారి చొక్కా' అని చాలా గౌరవంగా పిలువబడేది. పిచ్చిముండ నా చొక్కా మాత్రం నిజంగా బ్రతికిచెడ్డదే.

దాని గతవైభవం అంతా ఇంతా కాదు. ఇంట్లో నా చొక్కా ప్రాధాన్యత కాస్తా కూస్తగా వుండేది కాదు.

అప్పట్లో దానికున్న విలువ వేరు. గుర్తింపే వేరు. దాని కుండే ఆదరణ, పోషణ... ఒకటేమిటి.... మా ఇంట్లో కుటుంబ సభ్యులందరికీ నా చొక్కా అంటే పంచ ప్రాణాలు, ఇదంతా అలనాటి ముచ్చట. గతించిన మురిపెం.


"అయినా నా చొక్కా గొప్పతనం గురించీ, దాని జేబు ఔన్నత్యం గురించీ నాకు నేనే చెప్పుకుంటే డాంబికంగానూ, అతిశయోక్తిగానూ అనిపిస్తుందేమోమీకు. అందుకే నా పెద్ద కొడుకు సురేష్‌ను ....చిన్నకొడుకు రమేష్‌ను....కాదు...కాదు వాళ్ల నిజాన్ని నిర్భయంగా చెప్పగలరన్న నమ్మకం నాకు లేదు. అందుకే మీరుగనక **వాళ్ల అంతరాత్మల్ని మాట్లాడించ గలిగితే..... తప్పకుండా అక్షరం తేడా రాకుండా ఇదిగో ఇలా వినగలుగు తారు".**

సురేష్ :

"నా చిన్నతనంలో మా నాన్న చొక్కా అంటే నాకు అమితమైన ప్రేమగా, ఇష్టంగా వుండేది. రోజూ బడికి వెళ్లేటప్పుడు అక్కడ చిరుతిండ్లు కొనుక్కునేందుకు కావలసిన చిల్లర డబ్బులు ఆయనకు తెలీకుండానే, ఆయనజేబులోంచి తీసుకువెళ్లేవాడిని".

"రోజూ ఆఫీసునుంచి రాగానే నాన్న తన చొక్కాను హాల్లో గోడకున్న సీలకు తగిలించి పట్టుబట్ట కట్టుకుని భోజనానికి వెళ్లేవాడు. అ సమయంలో ఎవరికంట పడకుండా నాకు కావలసిన పావలానో, పదిపైసలో తీసుకుని ఎగురుకుంటూ పుస్తకాల నంచీ బుజాన వేసుకుని పరుగెత్తేవాడ్ని. కొనుక్కుతినేందుకు డబ్బుల్లేక బిక్కమొఖాలేసుకుని కూర్చునే పిల్లల్లా కాకుండా రోజూ "ఏదోటి కొనుక్కుతిని అందరి వంకా గర్వంగా చూసేవాడ్ని".

నా వయసుతోపాటు అవసరాలు కూడా పెరిగిన్నై. స్నేహితులు ఏర్పడ్డారు. నా ఖర్చులే కాకుండా తరచుగా వాళ్ళకు కూడా ఖర్చుపెట్టడం అలవాటయింది. అలా ఖర్చు పెట్టడం గొప్పగా వుండేది నాకు"




"ఏరోజూ నాన్న జేబు డబ్బుల్లేకుండా వుండేది కాదు. ముఖ్యంగా నాక్కావలసినంత తక్కువమొత్తం ఎప్పుడూ దొరుకుతూనేవుండేది. ఏ రోజయినా నాణెం చేతికి దొరక్కపోతే ఆయన జేబులో వుండే ఇతర కాయితాల మధ్యనవుండే రెండుకాయితమో, అయిదురూపాయిల నోటో సొంతం చేసుకునేవాడ్ని. అలాంటప్పుడు మాత్రం మరో మూడు, నాలుగు రోజుల వరకు ఆయన జేబులో చేయి పెట్టేవాడ్నికాదు."

"అప్పుడప్పుడు ఒంటరిగానూ, తరచుగా స్నేహితుల్తోనూ సినిమాలకు వెళ్లటం, హోటళ్లకు వెళ్లి తినడం వరకూ ఎదిగాన్నేను. ఆ నా ఖర్చులన్నింటిని పాపం మానాన్నజేబే భరించింది. అది నా పాలిట కల్పతరువుగా వుండేది".

"ఎప్పుడు ఎంత కావాలంటే అంత తీసుకువెళ్తుండేవాడ్ని. అలా నా చిన్నతనం, యవ్వనం కూడా డబ్బుకు ఇబ్బంది కాకుండా జల్సాగానే గడిపేశాను. అదంతా మానాన్న జేబు చలవే". అది పెద్దవాడి అంతరాత్మ అయితే యికిప్పుడు చిన్నవాడి విషయం వినండి మరి.

రమేష్ :

"నాన్న తనంతట తానుగా నాకెప్పుడూ డబ్బు ఇవ్వలేదు. "నా జేబులో వుండాలి చూసి తీసుకోరా" అనేవాడు. అడిగిన దానికంటె అదనంగానే తీసుకునేవాడ్ని. ఇక అడక్కుండా ఆయనకు చెప్పకుండా ఎన్నిసార్లు ఎంతెంత తీసుకున్నానో లెక్కలేదు".

"మా నాన్న జేబు నన్ను ఎన్నిసార్లు ఎన్నిరకాల కష్టాల్లో ఆదుకున్నదో. ఆ జేబే గనక నన్నలా ఆదుకోకపోయివుంటే నేననలు ఇంత దాకా చదువుకోగలిగివుండేవాడ్ని కాదేమో ననిపిస్తుంది".

"నేను, పుస్తకాలు, కలాలు, పెన్సిళ్లు ఎక్కువగా పారేసుకుంటుండేవాడ్ని. మతిమరుపు, అజాగ్రత్త ఎక్కువనాకు. నాన్న జేబు పుణ్యమా అని మర్నాటికల్లా పోయిన వస్తువునో, పుస్తకాన్నో కొనుక్కునే వాడ్ని. అందువల్లే నా దగ్గర అన్ని పుస్తకాలు, కలాలు పోయినట్లు ఎవ్వరూ తెలుసుకోగలిగేవారు కాదు. నిజానికి నా చదువు పూర్తయ్యే సరికి నేను కనీసం ఓనూరు కలాలైనా పారేసుకుని వుంటాను. ఎన్ని జామెంట్రీ బాక్సులు పారేసుకున్నానో!

"ఓ సారి చిల్లరకోసం నాన్నజేబు వెతుకుతుంటే ఆయన జేబులోంచి వందరూపాయల కాయితం బయటకు వచ్చింది. అది చూడగానే నాకు దడపుట్టింది. కాళ్లు చేతులు వణక సాగాయ్. ఒక్కసారిగా వంద కాయితం సొంతం చేసుకుంటే చాలా కాలం వరకు మళ్లీ నాన్న జేబుతో అవసరం రాదుకదా అనిపించింది. స్నేహితుల్ని తీసుకుని ఏవూరైనా వెళ్లి నాలుగు రోజులు సరదా

చేసుకుని వద్దామనిపించింది. కాని ధైర్యం చాల్లేదు. వందకాయితం జాగ్రత్తగా లోపలకి నెట్టి నాకు కావలసిన రెండ్రూపాయల కాయితం తీసుకున్నాను".

"బహుశా మేం అలా పెద్దదొంగతనాలు చేయకపోవటం వల్లా, నేను, అన్నయ్య, ఎవరికి వారమే దేజిక్కించుకునే రూపాయి లోపు చిల్లర గురించి ఆయన పెద్దగా పట్టించుకోలేదనుకుంటాన్నేను."

ఇక సినిమాలకు , షికార్లకు, చిరుతిండ్లకు నేను, అన్నయ్య కంటె ఏ మాత్రం తీసిపోను. అప్పట్లో మా నాన్న జేబే నాకు అక్షయపాత్ర. అయితే పెద్ద మొత్తంగా ఎప్పుడూ ఆయన జేబులోంచి తీసుకోకుండా ఆ మాత్రం నిజాయితీని మాత్రం నిలబెట్టుకున్నాను".

"నా చొక్కాజేబుతో ఇలాంటి సంబంధం మా ఆవిడక్కూడా లేక పోలేదు. అయితే అది అధికారికమైందిగా వుండేది'. "గాజుల బండి వచ్చినప్పుడో, స్టీలు సామాన్లు అమ్మే మనిషి వచ్చినప్పుడో, లోపావడాలు, జాకెట్ ముక్కలు వగైరా వగైరాలు కొనుక్కోదలిచినప్పుడుల్లా "ఏమండీ మీ జేబులో డబ్బులు తీసు కుంటున్నా" అనేన్నానే తనక్కావలసినదేదో తీసుకునేది. నాకు చెప్పకుండా ఎప్పుడయినా తీసుకున్నా తెలిగ్గా వున్నప్పుడు నా చెవిన పడేసేది".

"పాపం ఏ మాటకామాటే చెప్పుకోవాలి. మా ఆవిడ నా చొక్కా గురించి ఎంత శ్రద్ధ తీసుకునేదో. ఎంత శ్రమపడేదో నా చొక్కాను ఎప్పుడూ మల్లెపూవులా తెల్లగా తళతళమెరుస్తూ వుండేటట్లు ఉతికేది. మాయకుండా, చిరిగిపోకుండా, మడతనలక్కుండా, ఎప్పటికప్పుడు ఇస్త్రీ చేయించిన తెల్లని చొక్కా నా చేతికందించేది. చొక్కా తొడుక్కోగానే గుండీలు పెట్టేది."

ఇంట్లో అందరిదీ ఓ అలవాటయితే అత్తవారింట్లో ఏంచేస్తున్నదో, ఎలావుందో నా చిట్టితల్లి, మా అమ్మాయి అలవాటు మాత్రం ప్రత్యేకమైంది.

ఆమెకు ఏం కావాలన్నా నా దగ్గరకు వచ్చి మౌనంగా నించోనేది. ఆమెలా నుంచోగానే దేనికో టెండర్ పెట్టబోతున్నట్లు అర్థమయ్యేదినాకు.

"ఏమ్మా...ఏంకావాలి" నేనే అడిగేవాడ్ని. తలవంచుకుని తనకు కావలసిందేదో చిన్నగా గొణిగినట్లు చెప్పేది.

"ఎంతకావాలి"

"మీయిష్టం"

అలవాటు ప్రకారం "నాజేబులో వున్నయ్ చూడు తీసుకో" అనేవాడ్ని.

"నే తీసుకోను మీరే ఇవ్వండి" అంటూ మారాం చేసేది.

కూర్చున్నచోట్నుంచి లేచేందుకు బద్ధకించి "పోనీ ఆ చొక్కా ఇలా పట్రామ్మా...నేనే ఇస్తా" అంటే మాత్రం సంతోషంగా చకచకా వెళ్లి చొక్కా తెచ్చి నాకందించేది.

ఎప్పుడయినా తన అవసరానికి మించి ఇచ్చినట్లయితే "ఇంతెందుకులేనాన్నారు' ' అంటూ ఎక్కువనుకున్నడబ్బు నాకు తిరిగిఇచ్చేసేది.

"నీకు అక్కర్లేకపోతే ఆ డబ్బుమాకు ఇవ్వకూడదా" అని ఇద్దరు అన్నలు ఆమెమీద పోట్లాడటం నాచెవిన పడుతుండేది అప్పుడప్పుడూ.

మగపిల్లలిద్దరూ ఒక్కోసారి తమకు కావలసిన డబ్బు కోసం కూడా చెల్లెల్ని అడగమని బ్రతుమాలుతుండేవారు. అడగనంటూ మొండికేసేదామె. వాళ్ల అలకలు, అభ్యర్థనలు, బెదిరింపులు గమనిస్తూ నవ్వుకుంటుండేవాడ్నినేను.

ప్రస్తుతం నేను చొక్కా తొడుక్కునే అవకాశమూ లేదు. అవసరమూ లేదు. ఇల్లు విడిచి బయటకు వెళ్ళలేను. ఇంట్లోనే తిరగలేను. మంచంలో నించి నా అంతట నేను లేవలేను. నాకింకా చొక్కా ఎందుకు.

అయితే ఆ నా చొక్కాను ఏ ఇల్లుతుడుచుకునేందుకో, మా పిల్లలు న్యాకటర్లు తుడుచు కునేందుకో ఉపయోగించుకోకుండా, నా కోరిక మన్నించి దాన్నలా గోడకు వేలాడదీసి వుంచినందుకు మాత్రం నా కోడళ్లకు నేను ఎప్పటికీ కృతజ్ఞుడినే.

అలా చొక్కాను చూసుకుంటూ దాని గతవైభవంతో పాటు నా జీవితాన్ని నాకు నేను సమీక్షించుకుంటూ ఆ సంతోష క్షణాలను గుర్తు చేసుకుంటూ బ్రతకటానికి అలవాటు పడ్డాను.

అయితే ఇప్పటివరకూ దాన్ని గురించి నేను ఎవ్వరికీ చెప్పుకోలేదు. నాలో నేనే దాని గురించిన జ్ఞాపకాల్లో ఆనందంలో తేలిపోతుండేవాడ్ని.

ఈ రోజెందుకో నా చొక్కా గురించిన ఆలోచనల్లు నన్ను అనుక్షణం వెంటాడుతూ ఉండటాన, నా సంతోషాన్ని ఎవరికయినా చెప్పుకోవాలన్న ఉబలాటం ప్రారంభమయింది. అందుకే నా మనుమలిద్దర్నిపిలిచి చెప్పాలనిపించింది.

వాళ్లను పిలవబోతుండగా వరండాలోంచి వారిద్దరి అరుపులు, ఏడ్పులు అస్పష్టంగా వినిపించసాగాయ్.

"చూడు నాన్నా వీడు నా రూపాయి కాజేసాడు" అంటూ పెద్దమనుమడు తమ్ముడిపై ఫిర్యాదు చేయటం నా చెవిన పడింది. నా ఆలోచనకు అంతరాయం కలిగింది.

కొడుకులిద్దరి తగాదా తీర్చేందుకు తలదూర్చేడు నా పెద్దకొడుకు.

"నాకేం తెలీదునాన్న. వాడెక్కడ దాచిపెట్టుకున్నాడో కూడా నే చూడ్లేదు" అంటూ అమాయకంగా చెప్పాడు ముద్దు ముద్దు మాటల్లో చిన్నవాడు.

"ఏం కాదు నాన్నా. నిన్న నాకు అమ్మఇచ్చిన రూపాయి కాయితం తాతయ్య జేబులో పెడుతుంటేవాడు చూశాడు. వాడే తీసుంటాడు" అని ఏడుపులంకించుకున్నాడు పెద్దవాడు.

"తాతయ్యజేబులోనా" ఆశ్చర్యం కొంత అపహాస్యం కొంత మేళవించి అన్నాడు నా పెద్ద కొడుకు.

"అవును ...నిన్న అమ్మ ఇవ్వగానే తాతయ్య చొక్కా జేబులోనే దాచిపెట్టుకున్నాను" ఏడుస్తూనే చెప్పాడే వాడు.

"ఓరి పిచ్చాడా.... తాతయ్యజేబులో దాచిపెట్టుకున్నావా అది చిల్లిజేబురా" అంటూ విరగబడినవ్వేడు నా పెద్దకొడుకు.

వాడి మాటలకు విలవిల్లాడిపోయింది నామనసు.

కావాలంటే చూడు అంటూ కొడుకు లిద్దర్ని చొక్కా దగ్గరకు తీసుకువెళ్లాడు.

నా జేబులో తన చేతిని పెట్టాడు. బయటకు వచ్చిన అరచేతిని తమాషాగా గాల్లోకి వూపేడు చిన్న మనుమడు.

బాధగా కళ్లు మూసుకున్నాన్నేను. నా కనుకొలుకుల్లోని తడిని ఎవరికంటా పడనీయకుండా జాగ్రత్తపడ్డాను. ●